సామెతకథలు

# మొసలి కన్నీరు

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

ఒక చెఱువు గట్టున ఒక పెద్ద నేరేడు చెట్టు కలదు. దానిపై రక్తముఖుడనే కోతి నివసిస్తూ ఉండేది. ఒకనాడు కరాళముఖుడనే మొసలి చెఱువునుండి యీవలకు వచ్చి, యిసుక తిన్నెపై విశ్రాంతి తీసికొంటూ ఉండగా చెట్టుపైనున్న కోతి ఆ మొసలిని చూచి "ఓయీ! నీవు నా యింటికి అతిథివై వచ్చావు. కాన నేనిచ్చే పండో, ఫలమో తిని నన్నానందపఱచు" మంటూ కొన్ని నేరేడు పండ్లను కోసి క్రింద పడవైచెను. మొసలి కోతియొక్క సౌహార్దానికి ఎంతో మురిసిపోతూ ఆ పండ్లను తిన్నది. ఆ మొసలి నాటి నుండి ఆ నేరేడు చెట్టుక్రిందకు రోజూ వస్తూ, కోతి పడవేసే తియ్యని పండ్లను తింటూ, కొన్ని పండ్లను తన భార్యకు తీసికొనిపోయి యివ్వజొచ్చెను.

ఒకనాడు ఆడు మొసలి తన ప్రియునితో, "ఈ నేరేడు పండ్లే ఇంత తియ్యగా ఉంటే ఇక ప్రతిదినం ఈ తియ్యని పండ్లను తినే నీ స్నేహితుని గుండెకాయ ఇంకెంత తియ్యగా ఉంటుందో? అతని గుండెకాయ తప్పక రుచి చూడాలని ఉంది. వెంటనే నాకది తెచ్చి పెట్టు" మని పలికింది. "ఛీ! నీది మిక్కిలి చెడ్డకోరిక. అతడు నా సోదరుని కన్న మిన్న. మనలను మిక్కిలి దయతో చూస్తున్నాడు. దయచేసి నన్ను మిత్రద్రోహానికి పురికొల్పకు" మని మగమొసలి బ్రతిమాలుకొంది. ఆడు మొసలి తన మొండిపట్టు వదలలేదు. "నీవు కోతి గుండెకాయ తీసికొని రావలసిందే. అది తెచ్చి పెట్టకుంటే ఆహారము, నిద్ర విడిచి, నీకు దూరం అవుతాను. ఇది ముమ్మాటికి నిజం" అంటూ బెదిరించింది. మొసలి తన భార్య ప్రాణాలపై ఆశ వదలుకోవడమా? లేక మిత్రుణ్ణి వంచించి ప్రాణాలు తీయడమా? అనే ధర్మసందేహంలో పడింది. చివఱకు భార్య లేనిదే తాను బ్రతుకలేనని భావించుకొని చెలికాని జీవితానికే ఎసరు పెట్టడానికి బయలు దేరింది.

మొసలి ఎప్పటియట్లా నేరేడు చెట్టుక్రిందకు చేరడం కోతి చూచింది. అతని వాలకం విచారకరంగా ఉంది. "మిత్రుడా! నీ ముఖం అట్లా వాడిపోయిందేమి? ఎందుకు కన్నీరు కారుస్తున్నావు? ఇంత ఆలస్యంగా వచ్చావేమి?" అని అమాయకంగా జాలితో కోతి అడిగింది. "సోదరా! నీ వదిన యీ రోజున అనరాని మాటలతో నన్ను చడా మడా తిట్టింది. నీవు కృతఘ్నుడవు. నీకు సిగ్గులేదా? నిత్యం విందులు కుడవడమేగాని నా మఱిదికి ఒక మాఱైనా మన యింట విందు చేసావా? చేసిన మేలు మఱచిన పాపానికి నీకు ప్రాయశ్చిత్తం ఉందా? నేడైనా అతణ్ణి మన యింటికి తీసికొనిరా. లేకుంటే నీ ముఖం నాకు చూపించకు" మని నన్ను హెచ్చరించినది. "ప్రియ సఖుడా! ఆడుదాని పాటి వివేకం నాకు లేకపోయిందే? అని నా ముఖం విచారంతో వాడిపోయింది. ఆ బాధే నా కన్నీటి ధారలకు గుర్తు. నిన్ను మా యింటికి తీసికొనిపోవుటకు తగిన ఉపాయం ఆలోచిస్తూ మెల్లగా నడుస్తూండడంవల్ల ఇంత ఆలస్యమయింది" అని కల్లబొల్లి కబుర్లు పలికింది మొసలి.



"అన్నన్నా! మా వదినగారు పిలిస్తే నేను రానగలనా? కాని నేను గట్టున మాత్రమే మసలేవాడను. మీవలె నీట ప్రయాణించగలనా? దయచేసి ఆమెనే యిక్కడకు తీసికొనిరా" అని పలికింది అమాయికురాలైన కోతి. "ఓ చెలికాడా! ఈ చెఱువు దిగువనొక చక్కని యిసుక తెన్నెపై మా నివాసం. నీవు నా వీపుపై కూర్చుంటివా! క్షణంలో మా యింటికి భద్రంగా చేరుస్తాను. వెంటనే నా వీపుపై కెక్కు" మని తొందఱ పెట్టగా కాదనలేక, మొసలి చెప్పినట్లు చేసింది కోతి. నీటిలో పోవుచుండగా మొసలి ముఖం వాడిపోయి ఉండడం చూచి, "నీవు చెప్పినట్లే నేను మీ యింటికి వస్తున్నాను కదా! ఇంకను విచారింతువేల?" అని కోతి అడిగింది. "ఓయీ! వెఱ్ఱి నేస్తమా! ఇప్పుడు నిజం చెపుతున్నాను. నీ వెప్పుడూ తియ్యని పండ్లనే తింటూంటావుగనుక నీ గుండెకాయ అమృతంలాగు తియ్యనై ఉంటుందని నా భార్య నీ గుండె రుచి చూడగోరింది. అందులకే నిన్ను తీసికొని వెడుతున్నాను. ఇక నీకు చావు తప్పదు. దేవుణ్ణి ప్రార్థించుకో" అని పలికిన మొసలి మాటలకు తన భయమును కప్పిపుచ్చుకొని కోతి "అన్నా! ఎంత తెలివి తక్కువ పని చేసావు. గట్టుపై నున్నప్పుడీమాట చెప్పితే భద్రంగా చెట్టు తొఱ్ఱలో దాచి యుంచిన నా గుండెకాయను నాతో తీసికొని వత్తునుకదా!" అన్నదా కోతి.

"అరె! చిటికెలో పోయి గుండెకాయను తీసికొని వద్దాం" అంటూ మొసలి వెనుకకు మళ్ళి, కోతిని చెఱువు ఒడ్డుకు తీసికొని వచ్చింది. గట్టుకు చేరిన కోతి బ్రతుకు జీవుడా! అనుకొంటూ చెట్టెక్కి, తనరాకకై ఎదురుచూస్తున్న మొసలిని చూచి, కోపంతో "ఓరీ! కృతఘ్నుడా! నీవు నమ్మినవారినే చెఱుస్తావనుకోలేదు. ఇక నీ పన్నాగాలు నావద్ద చెల్లవు పో!" అని గద్దించింది. మొసలి తానాశించిన ఫలితం పొందలేకపోగా తన గుట్టు బట్టబయలయినందులకు చిన్న పుచ్చుకొని వెళ్ళిపోయింది.

లోకంలో జాలిగొలిపే మాటలు పలుకుతూ, దొంగయేడ్పులేడుస్తూ, బొట బొట కన్నీరు కార్చే కార్యవాదులను గూర్చి చెప్పునప్పుడు వారిది "మొసలి కన్నీరు" అనే జాతీయం వాడుతారు. *

*"మొండి శిఖండి" సామెత కథ వచ్చే సంచికలో...*

జ్ఞానత్రయం అంటే స్వజ్ఞానం, ప్రాపక జ్ఞానం, ప్రాప్య జ్ఞానం. విశేషాలు రానున్న సంచికలలో ...